

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా
పశ్చిమ
గోదావరి జిల్లా

మంగళవారం,26 ఆగస్టు 2025

8 పేజీలు


## సూపర్ సిక్స్ పథకాల

# అమలు పట్ల సంతృప్తి

**అభివృద్ధి - ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత**
**రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీలో మంత్రి రామానాయుడు**



**ఏలూరు,సూర్యబ్యూరో :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీ పథకాల పట్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి, సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుఅన్నారు. సోమవారం పశ్చిమగోదావరి జిల్లాలోని పాలకొల్లు తహసిల్దార్ కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్యూఆర్ కోడ్ కలిగిన స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తో కలిసి స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛ నంగా ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ అధికారం ఇస్తే అభివృద్ధి వైపు నడపాలని, విధ్వంసం వైపు కాదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంఅధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే

- తరువాయి 2లో..

## భీమవరం నుండి

# కలెక్టరేట్ తరలిస్తే ప్రజా ఉద్యమం

**ఎమ్మెల్యే అంజిబాబు, కేంద్ర మంత్రి వర్మ మౌనం వీడాలి**
**డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు ప్రయత్నాలపై ప్రజల్లో గందరగోళం**
**మండలి చైర్మన్ మోషన్ రాజు ఆగ్రహం**

**భీమవరం,మేజర్‌న్యూస్:** భీమవరం నుంచి పశ్చిమగోదావరి జిల్లా కేంద్రాన్ని, జిల్లా కలెక్టరేట్ ను తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారం పై శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం జారీ చేసిన జీవో 124 ప్రకారం గునుపూడిలో 20 ఎకరాల భూమిపై రూ.100 కోట్లతో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించిందని, కానీ ఇప్పుడు కొత్త యత్నాలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు ఉండి నియోజకవర్గం పెద



అమిరంలో కలెక్టరేట్ శంకుస్థాపనకు ముఖ్యమంత్రిని ఆహ్వానించారన్న వార్తలు ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయని విమర్శించారు.

- తరువాయి 2లో..

# అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు

**రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార శాఖ మంత్రి పార్థసారధి**



**నూజివీడు,మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో గత కొంతకాలంగా జరుగుతున్న అర్హులైన పింఛన్ దారుల జాబితా రీవైద్య పరీక్షల్లో కొంతమంది పింఛన్లు కోల్పోవడంపై ఆందోళన చెందడంతో మంత్రి నూజివీడు నియోజకవర్గ మండల అధికారులు, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ పింఛన్ల,తొలగింపు,పునరుద్ధరణపై అధికారులంతా పారదర్శకంగా పని చేయాలని అన్నారు. ఒక్కొక్క మండల అధికారులతో సమీక్షించి ఎంత మంది పింఛన్లు కోల్పోయారు,ఎంత మంది అర్హులు వారి జాబితా సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. వైద్యపరీక్షలు, వైద్య పత్రాలు మంజూరులో ఎటువంటి అవక తవకలు జరగకుండా పారదర్శకంగా పనిచేయవలసి బాధ్యత అందరిపై ఉందని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి, పింఛన్లు అందేలా ప్రభుత్వ అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని చూసించారు. పింఛన్లు అందించడంలో ప్రజల నమ్మకాన్ని,విశ్వాసాన్ని కోల్పోకుండా అర్హులైన వారందరికీ అందేలా చూడాలని అధికారులకు ఆదేశించారు.వచ్చేనెల 1వ తేదీ నాటికి అర్హులైన ప్రతి ఒక్కరికీ, పింఛన్లు

- తరువాయి 2లో..

## భార్యను చంపిన కేసులో

# ముద్దాయికి జీవిత ఖైదు

**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్ స్టేషన్లో 2018 జూన్ 4వ తేదీన జరిగిన భార్య హత్య కేసులో చవలపాటి శ్రీను అనే ముద్దాయికి జీవిత ఖైదు విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. చవలపాటి శ్రీను అతని భార్య ముప్పిడి కుమారి పై అనుమానంతో మంచం చెక్కతో బలంగా దాడి చేయగా చనిపోయింది.

అప్పటి సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.శ్రీను త్వరితగతిన విచారణ పూర్తి చేసి కోర్టు నందు చార్జి షీట్ ఫైల్ చేశారు.అనేక విచారణల తరువాత సోమవారం 11వ అదనపు జడ్జి షేక్ సికిందర్ భాష ముద్దాయి కి జీవిత ఖైదు, కఠిన కారాగార శిక్ష, పదివేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించ లేని పక్షంలో మరో ఆరు నెలలు జైలు శిక్ష విధించాలని తీర్పులో పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం రూరల్ సీఐ భీమేశ్వర రవికుమార్, రూరల్ ఎస్సైజెవిఎన్ ప్రసాద్ ఈ విచారణలో సహకరించినట్లు ఒక ప్రకటనలో తెలియజేశారు.

# అర్హులెవరికీ పెన్షన్ తొలగించరు

**దివ్యాంగులెవరూ ఆందోళన చెందవద్దు**
**దివ్యాంగుల చెంతకు వెళ్ళి వారితో మమేకమైన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి**

**ఏలూరు,మేజర్‌న్యూస్:** జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం పిజిఆర్‌యస్ కార్యక్రమానికి తమ సమస్యలను తెలియజేసేందుకు వచ్చిన దివ్యాంగులు వద్దకు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి స్వయంగా దివ్యాంగులు చెంతకు వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసు కున్నారు. దివ్యాంగులు బొర్రా సుధాకరమ్మ, ఇద్దాబత్తుల ప్రసన్న,నక్కా రాము,యు.ప్రవీణ్ కుమారిలు మాకు నోటీసులు అందాయని, పెన్షన్లు ఆగుతాయని అంటున్నా రని కలవటానికి వచ్చామని చెప్పారు. దీంతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి స్పందిస్తూ పింఛన్ల విషయంలో అర్హులైన



దివ్యాంగులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. నూరుశాతం అర్హులకు పింఛన్లు అందాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని అన్నారు. నోటీసులు ఇచ్చినవారికి

- తరువాయి 2లో..

# తల్లికి వందనం పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కారానికి చర్యలు

**భీమవరం, మేజర్‌న్యూస్:** జిల్లాలో తల్లికి వందనం పెండింగ్ క్లెయిమ్ లను పరిష్కారానికి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వాహనాల ఆధార్ సీడింగ్, తల్లికి వందనం, వర్క్ ఫ్రం హెూం, ఈ కేవైసీ, కౌశలం డాష్ బోర్డు తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ తల్లికి వందనం ఖాతాలోనగదుజమ చేయడానికి ఇబ్బందిగా ఉన్న అంశాల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఐదు నుండి ఏడు సంవత్సరాల మధ్య




వయసు కలిగిన మరియు 15నుండి 18 సంవత్స రాల వయసు మధ్య గలిగిన పిల్లలందరికీ ఆధార్ బయోమెట్రిక్‌ను అప్డేట్ చేయాలని సూచించారు .వర్కు ఫ్రొం హెూమ్‌లో భాగంగా సాంకేతిక విద్యను అభ్యసించిన నిరుద్యోగ యువతను గుర్తించి డేటాను కౌశలం డాష్‌బోర్డులో అప్డేట్‌చేయాలని సూచించారు. రిజిస్టర్ అయ్యి వాహన

- తరువాయి 2లో..

# ప్రజా ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి





**భీమవరం, మేజర్ న్యూస్:**ప్రజా ఫిర్యాదులు పరిష్కారంలో చక్కటి భాష, సంభాషణ శైలితో వ్యవహరించి నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారుసోమవారం జిల్లా కలెక్టరేట్ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరం నందు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పాల్గొని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అర్జీదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం పై రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని అన్నారు. పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలు క్షుణ్ణంగా పరి శీలించిన సిబ్బందితో నిర్ణయిత గడువులోగా పరిష్కార అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఒక్కో సందర్భంలో ఫిర్యాదులు పరిష్కారానికి కొంత సమయం అవసరం ఉన్నప్పుడు సంబంధిత విషయాన్ని ఫిర్యాదుదారులతో అధికారులు స్వయంగా మాట్లాడాలన్నారు. ఫిర్యాదులు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు ఎండార్స్ పంపాలని అన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన పిజిఆర్ఎస్ లో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 248 అర్జీలను స్వీకరించడం జరిగింది. ఫిర్యాదుల్లో కొన్ని ఈ విధముగా ఉన్నాయి.వీరవాసరం మండలం వీరవాసరం గ్రామ కాపురస్తులు మేడే పుష్పలత ఆమె కుమార్తె ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతుందని,%ఎ% ఆధార్ వివరాల్లో పొరపాట్ల వల్ల తల్లికి వందనం డబ్బులు జమ కాలేదని, వివరాలను సరిచేసి నగదు జమ అయ్యేలా చూడాలని ఆమె కోరారు. భీమవరం మండలం కొమరాడ గ్రామానికి చెందిన సానబోయిన నరసింహమూర్తి, రాజు, ఇరువురు తమ తల్లి నుంచి సంక్రమించిన ఆస్తి సర్వే చేసి హద్దులు చూపించవలసిందిగా కోరారు. భీమవరం పట్టణం మూడో వార్డుకు చెందిన షేక్ నశ్రీన్ ఇంటి స్థలం మంజూరు చేయమని కోరారు. ఆకివీడు మండలం చిన్నమిల్లిపాడు కాలింగూడెం గ్రామం నుండి బి హెచ్ సుధారాణి, మా పూర్వీకుల నుండి ఉన్న ఆరు సెంట్లు సొంత భూమి ఖాళీగా ఉండడంతో కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారు. వారిని అడుగగా వారు మాపై దౌర్జన్యం చేస్తున్నారు వారిని ఖాళీ చేయించి మా భూమి మాకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై దోసి రెడ్డి, డ్వామా పిడి డా. కె సి హెచ్ అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు ప్రజలనుండి అర్జీలను స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో ప్రయోవృద్ధుల ట్రిబునల్ కమిటీ సభ్యులు మేళం దుర్గాప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బాలకృష్ణకి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అభినందనలు



**న్యూఢిల్లీ,/ఏలూరు, మేజర్ న్యూస్:** భారతీయ సినిమా రంగంలో అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణకు లండన్ కు చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ గోల్డ్ ఎడిషన్ లో చోటు దక్కడం పట్ల ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అభినందనలు తెలిపారు. భారతీయ చిత్ర పరిశ్రమలో ఈ గౌరవం పొందిన తొలి నటుడుగా బాలకృష్ణ నిలవటం తెలుగు వారందరికీ గర్వకారణం అన్నారు.తన తండ్రి ఎన్టీఆర్ పేరు ప్రతిష్టలను నిలబెడుతూ, సినీ రంగంతో పాటు రాజకీయ, సేవా రంగాల్లో కూడా ఎదురులేకుండా దూసుకుపోతున్న బాలకృష్ణ ని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.1975లో వచ్చిన అన్నదమ్ముల అనుబంధం' చిత్రం నుంచి ఇటీవలే వచ్చిన డాకూ మహారాజ్ వరకూ హీరోగా 50 ఏళ్ల సినీ ప్రస్థానంలో 109 సినిమాలలో నటించిన పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## నందమూరి బాలకృష్ణకు రెడ్డి అప్పలనాయుడు అభినందనలు



ఏలూరు, మేజర్ న్యూస్ : వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, యూకే గోల్డ్ ఎడిషన్ లో నందమూరి బాలకృష్ణ పేరు నమోదు చేయడం చాలా సంతోషంగా ఉందని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడు అన్నారు. 50 సంవత్సరాలు హీరోగా గుర్తింపు పొందిన నందమూరి బాలకృష్ణ అపూర్వమైన సినిమా జైత్రయాత్ర కి, ఇది అత్యంత గౌరవప్రదమైన ఘనతగా నిలుస్తుందన్నారు. తన కెరీర్ అంతట బాలకృష్ణ తన తండ్రి లెజెండరీ స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) శాశ్వత వారసత్వాన్ని కాపాడుకోవడమ కాకుండా, నందమూరి వారసుడిగా అడుగు పెట్టి జానపదాలు, కుటుంబ కథా చిత్రాలు, యాక్షన్ చిత్రాలతో మెప్పిస్తూ, టాలీవుడ్ లో తన ఆల్ రౌండర్ ప్రతిభతో, శక్తివంతమైన స్క్రీన్ ప్రజెంట్, తనకున్న కళపట్ల అవిరామమైన నిబద్ధతతో తనదైన గుర్తింపును సాధించుకున్నారని తెలిపారు. హిందూపురం ఎమ్మెల్యే, పద్మభూషణ్ బాలకృష్ణ ప్రయాణం ఉత్సాహం, క్రమశిక్షణ శాశ్వత కళాత్మకకు సాక్ష్యం అని అప్పలనాయుడు పేర్కొన్నారు. ఇది అన్ని తరాల సినిమా ప్రేక్షకులను, వారికి అభిమాన పాత్రులను చేసిందన్నారు. గత 15 సంవత్సరాలుగా బసవతారకం, ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ గా, ఆయన పబ్లిక్ సర్వీస్ ను ఒక ఉదాత్త మిషన్గా నిరూపించారని అన్నారు.

# అర్హులెవరికీ పెన్షన్ తొలగించరు

మొదటిపేజి తరువాయి

త్వరితగతిన విచారణ చేసి అర్హులకు యధాతథంగా పింఛన్లను అందజేస్తామని, దివ్యాంగులెవరూ ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టరు భరోసానిచ్చారు.పుకార్లు, వదంతులు నమ్మవద్దని,అర్హత ఉన్న పింఛన్లన్నీ యథావిధిగా కొనసాగు తాయని జిల్లా కలెక్టరు స్పష్టం చేశారు. దివ్యాంగులకు సమస్యలు ఏమి ఉన్నా తనను స్వయంగా తనని కలిసి పరిష్కరించు కోవచ్చన్నారు.ఎక్కువ మంది వచ్చి సమయాన్ని, డబ్బును వృధా చేసుకోవద్దని జిల్లా కలెక్టరు హితవు పలికారు. దీంతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి ఆర్.విజయ రాజు, జిల్లా విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు మామిడిపల్లి నాగభూషణం, దివ్యాంగులు వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ పథకాల అమలు పట్ల సంతృప్తి

మొదటిపేజి తరువాయి

ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం ప్రజలందరూ చూస్తూనే ఉన్నారన్నారు.గత ప్రభుత్వంలో చేసిన సుమారు 15 లక్షల కోట్ల అప్పులను తీర్చే లక్ష్యంగా కృషి చేస్తూనే, అప్పులకు వడ్డీలను కూడా కడుతూ ఉండటంతో ఆర్థికపరిస్థితి సహకరించకపోయినా మంచి పరిపాలన దక్షత కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని పరిస్థితులను చక్కదిద్దుతూ సంక్షేమం, అభివృద్ధిని కొనసాగించడం ఎంతో గొప్ప విషయం అన్నారు. మెగా డీఎస్సీ పేరిట 16,350 టీచర్ల పోస్టులను భర్తీ చేసుకోవడం జరిగిందన్నారు. అన్న క్యాంటీన్లలో తక్కువ రేటుకే అల్పాహారం, భోజనం అందజేయడం ద్వారా ప్రతిరోజు సుమారు 2.50 లక్షల పేదవారికి ప్రయోజనం కలుగుచున్నదన్నరు. రైతాంగానికిగానికి సంవత్సరానికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందజేస్తామన్న హామీ అమల్లో భాగంగా తొలి విడతగా కేంద్ర, రాష్ట్ర సాయంగా రూ.7 వేలు అందజేయడం జరిగిందన్నారు. పిల్లలు బాగా చదువుకుంటేనే కుటుంబం ఆర్థికంగా ఉన్నతంగా ఉంటుందనే ఆలోచన చేసిన మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక కుటుంబంలో ఎంత పంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.13 వేలు తల్లికి వందనం పేరిట జమ చేయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం ఆగస్టు 15న స్త్రీ శక్తి పేరిట మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించకోవడం జరిగిందన్నారు. మత్స్యకారులకు రూ.20 వేలు అందజేశామని, అలాగే చేనేత కార్మికులకు జీఎస్టీ తగ్గించడం, పవర్ సబ్సిడీ, మగ్గం ఉన్నవారికి రూ.25 వేలు అందజేయడానికి క్యాబినెట్లో ఆమోదించడం జరిగిందన్నారు. అలాగే రాష్ట్రంలో గుంటలు లేని రహదారుల నిర్మాణాలను పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలను వేగవంతం చేయడంతో పాటు, విశాఖ ఉక్కు కర్మాగారాన్ని, రైల్వే జోన్ ను సాధించుకున్నామన్నారు. స్మార్ట్ రేషన్ కార్డ్ పంపిణీ ద్వారా ఏ సమయంలోనైనా, ఎక్కడ నుండైనా రేషన్ పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. వృద్ధులకు, దివ్యాంగులకు, శివారు గ్రామాలకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీకి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ పంపిణీని మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించే లక్ష్యంగా పాత కార్డులు స్థానంలో క్యూఆర్ కోడ్ కలిగిన కొత్త రైస్ కార్డులను అందుబాటులో తీసుకొచ్చిందన్నారు. జిల్లాలోని కార్డుదారులందరికీ స్మార్ట్ రైస్ కార్డులను ఇంటింటికి వెళ్లి అందజేయడానికి నాలుగు దశల్లో చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, నరసాపురం ఆర్డీవో దాసిరాజు, డి.ఎస్.ఓ ఎన్.సరోజ, తహసిల్దార్ వై.దుర్గా కిషోర్, ఎ ఎస్ ఓ రవి శంకర్, స్థానిక నాయకులు రోజా రమణి, బోనం చిన్న బాబు, శ్రావణ కుమార్, అరుణ పాల్గొన్నారు.

## భీమవరం నుండి కలెక్టరేట్ తరలిస్తే ప్రజా ఉద్యమం

మొదటిపేజి తరువాయి

ఇరిగేషన్ భూమిలో కలెక్టరేట్ నిర్మాణంసుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని స్పష్టం చేశారు.భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మౌనం వీడి ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని, అలాగే నరసాపురం ఎంపీ, కేంద్ర సహాయమంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ కూడా భీమవరం ప్రజలకు వివరణ ఇవ్వాలని ఆ డిమాండ్ చేశారు.జిల్లా కలెక్టరేట్ తరలిస్తే చూస్తూ ఊరుకోం, ప్రజా ఉద్యమం తప్పదు అని హెచ్చరించారు. భీమవరం ప్రజల హక్కును కాపాడుకునేందుకు పార్టీలకు అతీతంగా అందరూ ముందుకు రావాలి" అని మోషేనురాజు పిలుపునిచ్చారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు

మొదటిపేజి తరువాయి

అందేలా ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని ఆదేశించిన మంత్రి.ఈ కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గంలో చాట్రాయి, ముసునూరు, నూజివీడు రూరల్, ఆగిరిపల్లి,మండల అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లికి వందనం పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కారానికి చర్యలు

మొదటిపేజి తరువాయి

పోర్టల్‌లో ఉన్న అన్ని రకాల వాహనాలకు ఆధార్ సీడింగ్ పూర్తి చేయాలని తెలిపారు. మండలాల వారీగా పెండింగ్ ఉన్న ఇ-సర్వీస్ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేయించాలని డిజిటల్ అసిస్టెంట్లకు సూచించారు

వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రామ వార్డు సచివాలయాలు అధికారి వై.దోసి రెడ్డి, డ్వామా పి.డి డాక్టర్ కే సిహెచ్ అప్పారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగలింగ చార్యులు, సిపిఓ కార్యాలయం స్టాటిస్టికల్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.


# వికలాంగుల పెన్షన్లు రద్దు చేస్తే ఆందోళను సిపిఎం నాయకుడు పెద్దిరాజు



**నరసాపురం, మేజర్‌న్యూస్ :**రీవెరిఫికేషన్ పేరుతో వికలాంగుల పింఛన్ల తొలగింపు ప్రక్రియ ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కూరు పెద్దిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్థానిక ఆర్డీఓ దాసిరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన సదరం ధ్రువీకరణ పత్రం కలిగి ఉండి చాలాకాలంగా వికలాంగుల పింఛను తీసుకుంటున్న కొందరికి ఇటీవల తమ పింఛన్లను తొలగిస్తున్నట్లు నోటీసులు పంపడం దారుణమని అన్నారు. ప్రభుత్వం ఈ ప్రక్రియ కొనసాగిస్తే చాలామంది వికలాంగులు తమ పింఛన్లు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగం లేదా అధిక ఆస్తులు కలిగిన వారు పింఛన్లు పొందితే అలాంటి వాటిని నిలుపుదల చేస్తే అభ్యంతరం లేదని అన్నారు. అయితే రీ వెరిఫికేషన్ పేరుతో అర్హులైన చాలామందికి 40% లోపు వికలాంగత్వం చూపించి పెన్షన్ల తొలగించేందుకు కుట్ర జరుగుతుందని అన్నారు. రెండు కళ్ళు కనిపించని వారికి సైతం 40 శాతం లోపు వికలాంగత్వం చూపించి నోటీసులు అందజేశారని పెద్దిరాజు అన్నారు. గతంలో నలుగురు డాక్టర్ల టీం పరిశీలించి పర్సంటేజ్ రూపొందించారని, ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రిలో రీ వెరిఫికేషన్ ఒకే డాక్టర్ మాత్రమే పరిశీలించారన్నారు. గతంలో డాక్టర్ల టీం ఇచ్చిన సర్టిఫికెట్లు కరెక్ట్ కాదా అని ఆయన ప్రశ్నించారు. కుట్రపూరితంగా ప్రభుత్వం పెన్షన్లు తొలగించేందుకు వికలాంగత్వశాతం 40 లోపు వేశారని ఆరోపించారు. 40 శాతం దాటితేనే ప్రభుత్వం నుండి రాయితీలు వస్తాయని, అలా పొందకుండా శాతాన్ని తగ్గించి పెన్షన్లు రద్దుకు ప్రభుత్వం పూనుకున్నది అన్నారు. వికలాంగుల పట్ల మానవత్వం చూపి వారి పింఛన్లను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. పెన్షన్లు తొలగిస్తే ఆందోళన చేపడుతామని అన్నారు.

# కొల్లేరు గ్రామాల్లో బలే యేసు రాజ్యాంగం

**నత్తగుల్లపాడు గ్రామ సర్పంచ్ ముంగర రామకృష్ణంరాజు ఆరోపణలు**



**కైకలూరు, మేజర్‌న్యూస్:** ఆంధ్ర రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తున్నట్లు కొల్లేరు లంక గ్రామాల్లో కూడా బలే యేసు రాజు అనే వ్యక్తి రెడ్ బుక్ రాజ్యాంగం నడిపిస్తున్నాడని నత్తగుల్లపాడు గ్రామ సర్పంచ్ ముంగర రామకృష్ణ రాజు ఆరోపించారు. సోమవారం కైకలూరు పట్టణంలోని బృందావనం లాడ్జ్ నందు మీడియా సమావేశం ఏర్పాటు చేసి పలు ఆరోపణలు చేశారు. తాను నత్తగుల్లపాడు గ్రామంలో అర్హులైన 42 మందికి గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు స్థలం కేటాయించి పూడిక చేసి సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఇళ్ల స్థలాలు ఇస్తే సర్పంచ్‌కి పేరు వస్తుందని గ్రామానికి చెందిన కృష్ణానంద రావు,కొండలు కలిసి ముంగర సన్యాసిరావు అనే వ్యక్తికి కారు ఇచ్చి 2023వ సంవత్సరంలో హైకోర్టులో కేసు వేసి స్థలాలు ఇవ్వకుండా నిలుపుదల చేశారని పేర్కొన్నారు. ఏసు అనే వ్యక్తి లంక గ్రామాలను రెండు వర్గాలుగా విభజించి విభేదాలు సృష్టిస్తున్నాడని ఆరోపించారు. సర్పంచ్‌ని సర్పంచ్ పదవి చేయనివ్వకుండా తనకు అనుకూలమైన వ్యక్తులను సర్పంచ్ పదవి ఎక్కించాలని ప్రస్తుత సర్పంచ్ అయిన తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని వివరించారు. రాజ్యాంగం ప్రకారం గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు ప్రోటోకాల్ ప్రకారం సర్పంచ్ పాల్గొనాలని, అర్హత లేని వారు పాల్గొని యేసు రాజ్యాంగం నడిపిస్తున్నారన్నారు. ఎటువంటి అనుమతులు లేని కొల్లేరులో మాత్రం అక్రమ సాగు యధావిధిగా జరుగుతుందని, అనుమతులు ఉండి పేదలకు ఇచ్చే స్థలాలు మాత్రం నిలుపుదల చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు సుప్రీంకోర్టు ఆదేశాలు పాటిస్తారా ? లేకపోతే నాయకులు ఇచ్చే ముడుపులకు పనిచేస్తారా అని ప్రశ్నించారు.ఇప్పటికైనా కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ స్పందించి నత్తగుల్లపాడు గ్రామానికి చెందిన 42 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చేలా కృషిచేసి విభేదాలతో సతమతమవుతున్న గ్రామాన్ని ప్రశాంతం చేయాలని కోరారు. లేని పక్షాన గ్రామంలో జరుగుతున్న అక్రమ సాగుపై ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని తెలిపారు.

# స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పితాని




**పెనుమంట్ర, మేజర్ న్యూస్ :**అధికారులు. రేషన్ డీలర్లు ప్రజలు మన్ననలు పొందేలా పనిచేయాలని మాజీ మంత్రి ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం పెనుమంట్ర పంచాయతీ గ్ కార్యాలయం వద్ద నూతన స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ పంపిణీలో పారదర్శకత, ఇబ్బందులు తొలగించేందుకుగాను అధునాతన టెక్నాలజీతో కూడిన స్మార్ట్ కార్డులు పంపిణీ చేసిందని అన్నారు. సచివాలయ సిబ్బంది సకాలంలో లబ్ధిదారులకు క్యూ ఆర్ కోడ్ తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాలని అన్నారు. ప్రభుత్వం వివిధ పథకాలతో పాటు రేషన్ కార్డులు కూడా మహిళల పేరుతోనే జారీ చేసిందని మహిళలకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తుందని ఆయన అన్నారు. ప్రభుత్వం రేషన్ పంపిణీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తుందని రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే వారిపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, సామాజిక పింఛన్లు పెంపు, తల్లికి వందనం, మహిళలకు స్త్రీ శక్తి పథకం అన్నదాత సుఖీభవ పథకాలు దిగ్విజయంగా అమలు చేశామని సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్టు అని ఆయన అన్నారు. గత ప్రభుత్వంలో నాసిరకం మద్యం సరఫరా చేసి వారి ఆరోగ్యాలను నాశనం చేసిందని ప్రస్తుతం కూడా వైసిపి ప్రభుత్వం కూటమి ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని ప్రజలు గ్రహించాలని అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. క్యూ ఆర్ కోడ్‌తో రేషన్ కార్డులు పంపిణీ చేయడం పట్ల పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు,ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, ఎంపీపీ, తహసిల్దార్, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్రలో మిషన్ ఈ-3పై వర్క్ షాప్



**నరసాపురంరూరల్,మేజర్‌న్యూస్:**మండలంలోని సీతారాంపురంలో గల స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలోని ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో మిషన్ ఈ-3పై డాక్టర్ రమేష్ కన్నెగంటి వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థులకు భవిష్యత్ కార్యక్రమాలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.వి. సత్యనారాయణ, ట్రెజరర్ కె. వెంకటేశ్వర స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ డా. ఎస్. సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా. ఏ. గోపిచంద్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ బి.ఎస్. రావు, కోఆర్డినేటర్ డాక్టర్ బి. రమణకుమార్, విభాగ సిబ్బంది, విద్యార్థినులు, విద్యార్థులు పాల్గొన్నారు.


## ఘనంగా తాసిల్దార్ సత్యనారాయణ పుట్టినరోజు





**నరసాపురం, మేజర్ న్యూస్ :** తాసిల్దార్ ఐ.వి.వి సత్యనారాయణ పుట్టినరోజు వేడుక సోమవారం ఉద్యోగులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. పుష్పగుచ్ఛాలు అందించి, కేకు కట్ చేయించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల మత్స్య సహకార సంఘాల అధ్యక్షులుమైలా వసంతరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు వ్యక్తిగత కార్యదర్శి సంకు భాస్కర్ నాయుడు, డీలర్ల సంఘం అధ్యక్షులు అధికారి ఏసు తదితరులు పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కేకు కట్ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్లు ప్రసాద్, కిషోర్, విజయదుర్గ, మహేష్, ఆర్ ఐ లక్ష్మీనారాయణ, వీఆర్వోలు చిరంజీవి, జయరాం, సత్తిబాబు కార్యాలయ సిబ్బంది పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ వినూత్న



**ఆగిరిపల్లి,మేజర్‌న్యూస్:** నూజివీడు సబ్ కలెక్టర్ కలెక్టర్ బి.వినూత్న మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో సోమవారం రైతు ఉత్పత్తిదారు పరస్పరం సహాయక కూప్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల షాపును ఆకస్మిక తనిఖీ చేశారు. సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ । యూరియా రైతులకు అమ్మకం జరిపేటప్పుడు ఆగిరిపల్లి మండలము మొదటి ప్రాధాన్యతగా ఉండాలని,తనిఖీ లో భాగముగా స్టాకు రిజిస్టర్ లను షాపు లోని ఎరువుల లభ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు. పరిశీలించారు.యూరియా అమ్మకం జరిపేటప్పుడు ఎటువంటి ఇతర ఉత్పత్తులను అమ్మరాదని,యూరియాను కృత్రిమ కొరత సృష్టించాలని ప్రయత్నించిన డీలర్లపై కఠిన చర్యలువుంటా యని,యూరియా అమ్మకంలో అవకతవకలు జరిపే డీలర్ల లైసెన్స్‌లు రద్దు చెయ్యబడతాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమ ంలో మండల తహసిల్దార్ పిఎన్‌వి ప్రసాద్, మండల వ్యవసాయాధికారి జె భవాని, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పరిశోధనల జోరుతోనే వైజ్ఞానిక పురోగతి సాధ్యం






ఎక్ట్రానిక్స్ సిఈఓ దాసరి రామకృష్ణ

**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** పరిశోధనల జోరుతోనే వైజ్ఞానిక పురోగతి సాధ్యమని ఎక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సిఈఓ దాసరి రామకృష్ణ సూచించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి బీటెక్ లో ప్రవేశాలు పొందిన ప్రధమ సంవత్సరం విద్యార్థులకు ప్రాంగణంలోని రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో ఇండక్షన్ ప్రోగ్రామ్ ను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి దాసరి రామకృష్ణ మాట్లాడుతూ దేశ ప్రగతిలో టెక్నాలజీ ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యార్థులు అంతర్జాలంతో స్నేహం చేస్తే మనకు తెలియని ఎన్నో కొత్త విషయాలను నేర్చుకోవచ్చని సూచించారు. ఇంజినీరింగ్ చేసే విద్యార్థుల కొలువులకు కొదవలేదని చెప్పారు. సద్బుద్ధి, సంకల్పం, పట్టుదల, కృషి వంటి వాటిని తమ లక్ష్యసిద్ధికి సోపానాలుగా మలుసుకున్న విద్యార్థులు విజయ శిఖరాలను సులువుగా అధిరోహిస్తారని చెప్పారు. ఓ వినూత్న ఆలోచన ప్రపంచ స్వరూపాన్నే మార్చి వేస్తుందని, విద్యార్థులు సమాజం ఎదుర్కొంటున్న కఠిన సవాళ్లను అధిగమించేందుకు నూతన ఆవిష్కరణల రూపకల్పనకు కృషి చేయాలని వివరించారు. ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్.వి. రమణారావు మాట్లాడుతూ దేశంలో 31వ నిట్ గా అవతరించిన ఏపీ నిట్ పదేళ్ల ప్రస్తానాన్ని పూర్తిచేసుకుందని తెలిపారు. కృత్రిమమేధ, మిషన్ లెర్నింగ్, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాక్ చైన్ వంటి అత్యాధునిక సాంకేతికతలపై పట్టు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. నైపుణ్యాలకు సాంకేతికతను జోడిస్తే ఎన్నో అద్భుతాలు రూపుదిద్దుకుంటాయని, విద్యార్థులు ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్, డీన్ అకడమిక్ డాక్టర్ కే.హిమబిందు,డాక్టర్ ఎన్.జయరామ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా లక్ష్యాలను ఉద్దేశించు కుని వాటి సాధనకు నిరంతరం పాటుపడాలని వివరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్ లు డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, డాక్టర్ కార్తీక్ శేషాద్రి, డాక్టర్ వీరేశ్ కుమార్, డాక్టర్ వి.సందీప్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సంస్థ నియమ, నిబంధనలకు అనుగుణంగా నడుచుకో వాలని వివరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఇండక్షన్ కార్యక్రమం సెప్టెంబర్ ఒకటి వరకు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్లు,ఆచార్యులు పాల్గొన్నారు.

# పల్లెల్లో ఆణిముత్యాలు



కలిదిండి/కైకలూరు,మేజర్‌న్యూస్: ఉన్నత చదువుల్లో రాణించాలంటే అంత సులువు కాదు. గ్రామాలకు పట్టుకొమ్మలు ఉన్నత చదువులు అదే పల్లె ప్రాంతాల్లో ఆణిముత్యాలు ఉంటాయని నిరూపించారు. డాక్టర్ హరిత. డాక్టర్ భాను శ్రీ కలిదిండి మండలం భాస్కర రావు పేటకు చెందిన పాల రాంబాబు రామలక్ష్మి దంపతులకు హరిత భాను శ్రీ ఇరువురు కుమార్తెలు వీరి జీవనాధారం కిరాణా. ఫ్యాన్సీ షాప్ నిర్వహిస్తారు వీరి ఇద్దరు ఆడపిల్లలను కష్టపడి చదివించారు. హరిత వెటర్నరీ విభాగంలో మాస్టర్ వెటర్నరీ సైన్స్ కోర్స్ పూర్తి చేసి. పి హెచ్ డి జన్యు శాస్త్రం ( జీవాలపై పరిశోధన) చేస్తున్నారు. రెండవ కుమార్తె భాను శ్రీ గుంటూరు మెడికల్ కళాశాలలో ఎం బి బి ఎస్ కోర్స్ పూర్తిచేసి ఈ నెల మూడో తేదీన నీట్ ఎంట్రన్స్ పరీక్షలు రాశారు. పీజీ కోర్స్ జరిగే పరీక్షల్లో జాతీయస్థాయిలో 2 5 8 ర్యాంకు సాధించింది. తమ పిల్లలు 10వ తరగతి నుండి ప్రతి కోర్సులోనూ ప్రతిభ కనబరచడం సంతోషంగా ఉందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్ల తాము ఉన్నత చదువులకు వెళ్లేమని వారికి కృతజ్ఞతలు తెలిపారు. వైద్య రంగంలో సేవలు అందించాలని ఆశపడుతున్నామన్నారు. డాక్టర్ హరిత, భాను శ్రీలను పలువురు అభినందించారు.

## బాలకృష్ణకు అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే రాధాకృష్ణ



**తణుకు,మేజర్ న్యూస్** :సినీరంగంలో 50 ఏళ్లు పూర్తి చేసుకోవడంతోపాటు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, యూకే గోల్డ్ ఎడిషన్‌లో స్థానం దక్కించుకున్న సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక సినిమా హీరోగా ప్రత్యేక స్థానం దక్కించుకోవడం అభనందనీయమన్నారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ద్వారా వచ్చిన సినీ వారసత్వాన్ని కాపాడుకోవడమే కాకుండా తనకంటూ ప్రత్యేకమైన అభిమానులను సాధించుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. తన ప్రతిభ, నిబద్ధత, కళామతల్లి పట్ల కలిగిన ప్రత్యేకమైన అభిమానం ఇంతటి గుర్తింపునకు కారణమైందన్నారు. సినిమా విషయంలో బాలకృష్ణ నిబద్ధత, కళల పట్ల చూపించే శ్రద్ధకు దక్కిన గౌరవంగా ఎమ్మెల్యే రాధాకృష్ణ అభివర్ణించారు.

# ఎన్.ఆర్.ఐ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పోస్టర్ ఆవిష్కరణ




**ఆగిరిపల్లి,మేజర్‌న్యూస్:** మండలం పరిధి పోతవర ప్పాడు గ్రామ శివారు గోపాలపురంలోని ఎన్.ఆర్.ఐ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సోమవారం వచ్చే నెల సెప్టెంబర్ 1 నుండి సెప్టెంబర్ 6వరకు జరగనున్న అడ్వాన్స్‌డ్ విఎల్ఎస్ఐ డిజైన్, నెక్స్ట్ జనరేషన్ సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కోసం ఏఐ ఆధారిత ఆటోమేషన్ స్పాన్సర్డ్ 6రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కి సంబంధించిన పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ ఈ కార్యక్రమం పాల్గొన్న కళాశాల చైర్మన్ డా'రావి వెంకటరావు మాట్లాడుతూ అధునాతన విఎల్ఎస్ఐ డిజైన్ సాంకేతికతలతో పాటు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఆటోమేషన్ పరిజ్ఞానాన్ని విద్యావేత్తలకు అందించేందుకు ఉద్దేశించబడిందని, దేశవ్యాప్తంగా ఉన్న శిక్షణార్థుల కోసం రూపొందించబడిన ఈ కార్యక్రమం ద్వారా సెమీకం డక్టర్ రంగంలో ఉన్న తాజా పరిశోధనలు, అభివృద్ధులను పంచు కోనున్నారని తెలిపారు.

ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపాల్ డా.సి. నాగ భాస్కర్,అకాడెమిక్ డైరెక్టర్ డా. జి. సాంబశివరావు, డీన్ ఆర్ అండ్ డి డా.కె.వి.సాంబశివరావు,ఈసిఈవిభాగాధిపతి డా.కె. రామాంజనేయులు, ప్లేస్మెంట్ డైరెక్టర్ డా. ఎన్.వి.సురేంద్ర బాబు,డీన్ ఈసిఈ అండ్ కోఆర్డినేటర్ డా. వి. శ్రీనివాసరావు, మరియు కో-కోఆర్డినేటర్ డా.వై. అర్పిత తదితరులు పాల్గొన్నారు.

## నేరేడుమిల్లిలో వైసీపీ గ్రామ కమిటీ ఎన్నిక



**యలమంచిలి,మేజర్‌న్యూస్:** మండలంలోని నేరేడుమిల్లి గ్రామంలో సోమవారం వైసీపీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆ పార్టీ మండల అధ్యక్షులు ఉచ్చుల స్టాలిన్ బాబు మాట్లాడుతూ ఓటమితో కృంగిపోకుండా ప్రజల పక్షాన నిలబడాలని కార్యకర్తల్లో మనోధార్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో సర్పం, చ్ల ఛాంబర్ అధ్యక్షులు కవురు గోపి, బోనం బులి వెంకన్న, కుక్కల బాలచంద్రన్, నామన సుబ్బారావు, కె.వెంకన్న టి. రత్నరాజు ఎం దేశంగి రాజుటి. రత్నరాజు, బి.రంగారావు, కె నాగేశ్వరావు, డి గణేష్ కె. ఉదయ్, జె శాంతరావు జి. మహేష్,పి.బి.లాలు ప్రసాద్ కె శ్రీనుఎ.వెంకన్న, బి.ఎమ్.పెద్దిరాజు డి.సూరయ్య బి.రంగారావు. లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీలో ప్రతిభ చూపిన వలవల త్రిపుర సుధ



**యలమంచిలి, మేజర్ న్యూస్:** మండలానికి దూరంగా విసిరేసినట్లు కనిపించే కనకాయ లంక గ్రామంలో చదువు పట్ల తనకున్న పట్టుదల, ఏదో సాధించి ఉన్న ఊరికి, కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలనే తపనే ఆమెనును తారా స్థాయికి తీసుకెళ్ళింది. మండలంలోని కనకాయలంక గ్రామానికి చెందిన వలవల త్రిపురసుధ మెగా 2025 డీఎస్సీలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మట్టిలో నుండి మాణిక్యం వెలికి తీయబడినట్లు 4.వ. ర్యాంకు సాధించింది. తండ్రి వలవల విజయ సారధి ఫోటోగ్రాఫర్, తల్లి వెంకట పుష్పావతి అంగన్వాడి టీచర్ . కనకాయలంక గ్రామానిక చెందిన వలవల త్రిపుర సుధ పదో తరగతి వరకు బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నగరం హైస్కూల్లో చదివింది. ఇంటర్మీడియట్, డిగ్రీ పాలకొల్లు ఆదిత్య కాలేజీలో విద్యాభ్యాసం పూర్తి చేసింది. డీఎస్సీలో ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలను అధిరోహించిన త్రిపుర సుధను ఆ గ్రామ సర్పంచ్ మద్దా శ్రీనివాస రావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

## డీఎస్సీ 2025లో
## రోస్టర్ పద్ధతి సరిగా అమలు చేయక పోతే న్యాయపోరాటం



**ఏలూరు, మేజర్‌న్యూస్ :** డీఎస్సీ 2025 అమలు చేసే విషయంలో రోస్టర్ పద్ధతిని సరిగ్గా అమలు చేయట్లేదని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్, దళిత మహాసభ సీనియర్ నాయకులు నేతల రమేష్ బాబు తెలిపారు.ఎస్సీ, ఎస్ టి ఆఫీసర్స్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ అంగుళూరు సర్వేశ్వరరావు, జిల్లా ఎస్సీ ఎస్టీ ల చైర్మన్ గంజి మధు, హెచ్ఎం అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గారపాటి ప్రకాష్ తో కలిసి ఏలూరు జిల్లా డీఈవో కి అభ్యంతరాలను తెలియజేస్తూ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ వినతి పత్రంలో జీవో నెంబర్ 7 చెప్పిన విధంగా పూర్తిస్థాయిలో అనగా 100 శాతం రిజర్వేషన్ ని అమలు చేయాలని, రోస్టర్ సిస్టం పూర్తిస్థాయిలో రిజర్వేషన్ అమలు అయ్యే విధంగా చూడాలని, ఈ రోస్టర్ సిస్టం అమలు చేయడంలో ఏమాత్రం అవకతవకులు చేసినా న్యాయ పోరాటానికి వెనకాడమని వారు డీఈవోకు తెలిపారు. తక్షణమే రోస్టర్ సిస్టం అమలు చేయడంలో జరిగిన తప్పిదాన్ని సరి చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

# రైతుల ఆదాయం పెరిగేందుకు ప్రధాని మోడీ కృషి

**కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ**



**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్ :**తాడేపల్లిగూడెం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ తాడేపల్లిగూడెం ఏర్పాటుచేసిన అభినందన సభలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, ప్రభుత్వ విప్ బోలిశెట్టి శ్రీనివాస్, నియోజకవర్గ బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ భారతదేశం వ్యవసాయ ఆధారితదేశంఅని, భారత ప్రధాని నరేంద్ర మోడీ రైతుల ఆదాయం పెరగాలని అనేక కార్యక్రమాలు, ప్రణాళికలు ప్రవేశపెట్టారు. కిసాన్ సమృద్ధి పథకం రైతులకు రూ.7 వేలు ఇవ్వడం జరిగింది. సకాలంలో రైతులకు విత్తనాల పంపిణీ, లోన్లు, సహకార సంఘాల ద్వారా పంపిణీ చేసే కార్యక్రమం ప్రభుత్వాలు తీసుకుంటున్నాయి. చిన్న చిన్న విభేదాలు ఉన్నప్పటికిని వాటన్నిటిని పరిష్కరించుకుంటూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుంది. పవన్ కళ్యాణ్ చొరవతో కూటమి ఐక్యతను సమైక్యతను కొనసాగిస్తామని ప్రజల అభివృద్ధి ఆకాంక్షల దిశగా పయనిస్తామని తెలిపారు. అందుకు స్థానిక నాయకులు బొలిశెట్టి శ్రీనివాస్ బాబ్జిలతో మాట్లాడుతున్నానని తెలియజేశారు. రాష్ట్రంలో చంద్రబాబు పవన్ కళ్యాణ్ ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ వస్తున్నారు.

ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు బిజెపి నేతలు పాల్గొన్నారు. 13వ తేదీన స్వల్ప సమయంలో కురిసిన భారీ వర్షం వల్ల నష్టపోయిన 1500 ఎకరాల పంట వివరాలను నాయకులు కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మకు తెలియజేశారు. దీనిపై కేంద్రంతో మాట్లాడి సత్వరమే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు.

# బాల్యవివాహాలతో పలు అనర్ధాలు




**ఏలూరు,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సోమవారం ఎ.ఎస్.ఆర్. స్టేడియం దగ్గర ఉన్న షెడ్యూల్ తెగల వసతి గృహము నందు బాల్య వివాహాలు – వాటి వల్ల కలిగే నష్టాలు పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ నుండి 30వ తేదీ వరకు ఒక వారం రోజులు పాటు బాల్య వివాహాలు, వాటి వల్ల కలిగే అనారోగ్య సమస్యల పైన అన్ని తరగతుల వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారని, అందులో భాగంగా ఈ వసతి గృహం నందు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందని, ఈ వసతి గృహంలో ఉన్న విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ఈ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించాల్సిందిగా సూచించడం జరిగిందని, సహజముగా ఈ ఆచారం షెడ్యూల్ తెగలు కులాలలో కొంత ఎక్కువ మేర జరుగుతుందని, ఈ షెడ్యూల్ తెగల వసతి గృహములోని బాలురు వారి తల్లిదండ్రులకు వీటి పైన అవగాహన కలిగించి, బాల్య వివాహాలను నిరోధించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. సమాజంలో ప్రతి పౌరులు బాల్య వివాహాలను నిరోధించడానికి కృషి చేయాలని, బాలికలకు 18 సంవత్సరములు బాలురకు 21 సంవత్సరంలో నిండిన తర్వాత మాత్రమే వివాహాల నిర్వహించాలని అప్పుడే వారు సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉంటారని తెలియజేశారు. ఎక్కడైనా బాల్ వివాహాలు నిర్వహించిన 1098 లేదా 15100 తెలియచేయాలని, అలా తెలియచేసిన వారి యొక్క సమాచారం గోప్యంగా ఉంచుతారని తెలియజేశారు. ప్రభుత్వం ప్రమాణాలకు తగిన విధంగా విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని, ఈ విషయంలో రాజీ పడవద్దని, మంచినీరు పరిసరాల పరిశుభ్రత విషయంలో తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సి.డబ్ల్యూ. సి ఇన్చార్జ్ చైర్మన్ పి. వెంకటేశ్వరరావు, వసతిగృహ వార్డెన్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాలు, నిమజ్జనలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలి

**ఎరువులు, యూరియా, డిఏపి అక్రమ నిల్వలు,**
**కృత్రిమ కొరత సృష్టించేవారిపై కేసులు నమోదు**
**అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్‌లో**
**సమీక్షించిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి**




**ఏలూరు, మేజర్‌న్యూస్ :** వినాయకచవితి ఉత్సవాల సమయంలో జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎరువులు సరఫరా, వినాయకచవితి ఉత్సవాల సమయంలో ముందస్తు జాగ్రత్త చర్యలపై కలెక్టరేట్ నుండి సోమవారం సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓ లతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వినాయకచవితి ఉత్సవాల సమయంలో, నిమజ్జన సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, మండల, గ్రామ స్థాయిలలో కమిటీలను ఏర్పాటుచేసి, వినాయకచవితి ఉత్సవాల సమయంలో బాణాసంచా, విద్యుద్ఘాతం వంటి ప్రమాదాలు జరగకుండా, నిమజ్జన సమయంలో ముఖ్యంగా కొల్లేరు లంక గ్రామాలలో ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా బాణాసంచా అనధికార నిల్వలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఒకేరోజు ఎక్కువ సంఖ్యలో నిమజ్జనాలు జరగకుండా చూడాలన్నారు. బెల్ట్ షాపుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు.

**యూరియా అక్రమ నిల్వలు, తరలింపు, కృత్రిమ కొరత లపై నిఘాబీ అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం:**

జిల్లాలో యూరియా ఎరువులు, డిఏపి అక్రమంగా నిల్వ ఉంచి కృత్రిమ కొరతలపై ప్రత్యేక నిఘా పెట్టి కేసులు నమోదు చేయాలనీ జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. యూరియా ఎరువులు, డిఏపి లపై కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందజేస్తున్నదని, అటువంటి యూరియా కల్తీ కాకుండా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మన జిల్లా నుండి ఎరువులు ఇతర జిల్లాలకు తరలిపోకుండా అంతర జిల్లా, రాష్ట్రాల సరిహద్దుల చెక్ పోస్టల వద్ద గట్టి నిఘా ఏర్పాటుచేయాలన్నారు.

## గ్రామీణాభివృద్ధే ఎన్డీఏ ప్రభుత్వ ధ్యేయం -ఎమ్మెల్యే డా.కామినేని శ్రీనివాస్





**ముదినేపల్లి ,మేజర్‌న్యూస్ :** గ్రామీణాభివృద్ధే ఎన్డీఏ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలం లోని కోడూరు గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, సిసి రోడ్లు, మంచినీటి చెరువు పెన్సింగ్, కిసాన్ డ్రోన్స్ డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ అడుసుమిల్లి కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధితోనే దేశ సౌభాగ్యం ముడిపడి ఉంటుందన్నారు. గ్రామాల్లో పూర్తిస్థాయి సిసి రోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, విద్యుత్ దీపాలు , డ్రైనేజీ సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలు రూపకల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పరిరక్షణకు గ్రామస్తులు పూర్తి సహకారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వై రామకృష్ణ , ఏడిఏ జి వెంకటమణి, ఏవో బి వేణుమాధవ్, మండల టిడిపి అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి , కార్యదర్శి మౌనిజ, నాయకులు .కోడూరు శేషుబాబు , బొర్ర చలమయ్య , చలసాని జగన్మోహన్రావు , చల్లగుళ్ల ఆదిత్య చౌదరి, వల్లభనేని శివాజీ, తాతినేని చంటి, వీరంకి వెంకటేశ్వరరావు, బొంగు రవికుమార్, అధికారులు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఇన్సూరెన్స్ చెక్కు అందజేసిన డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి



**నర్సాపురంరూరల్, మేజర్‌న్యూస్ :** మండలంలోనిలక్ష్మణేశ్వరం సొసైటీలో అల్లు సర్వరావుకి ఇన్సూరెన్స్ రెండు లక్షల చెక్కును డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ, చాగంటి పార్ధసారధి అందజేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## కొప్పర్రులో పుస్తకాల పంపిణి



**నర్సాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** మండలంలోని కొప్పర్రు గ్రామంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమం వైయన్ కళాశాల ఉపాధ్యక్షులుచినమిల్లి సత్యనారాయణ రావు సౌజన్యంతో రాయల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈకార్యక్రమంలో మునుకోటి వెంకటేశ్వరరావు, పోలిశెట్టి గణేశ్వరరావు,ఆరేటి మృత్యుంజయ, రమేష్, చినమిల్లి వీరబాబు,నూకల రత్నాజి తదితరులు పాల్గొన్నారు.

### అరకు టిడిపి సమావేశంలో ఎమ్మెల్యే బడేటి చంటి




**అరకు/ఏలూరు,మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ పార్లమెంట్ కమిటీల ప్రతిపాదనల కోసం ముగ్గురు పరిశీలకులను పార్టీ తరఫున నియమించిన విషయం తెలిసిందే.ఈ క్రమంలో బడేటి చంటికి కేటాయించిన అరకు పార్లమెంట్ విభాగ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో బడేటి చంటి పాల్గొని, నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలపరచడం, స్థానిక సమస్యలు, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలపై పార్టీ కార్యకర్తలతో చర్చించారు.

# పిజిఆర్ యస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి





**అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీదారులతో మాట్లాడి చక్కని పరిష్కారం చూపాలి**

**పిజిఆర్ యస్‌లో వచ్చిన అర్జీలు 441**

**ఏలూరు, మేజర్ న్యూస్ :**జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరరు కె.వెట్రిసెల్వితో పాటు జిల్లా జాయింటు కలెక్టరు పి.ధాత్రిరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్,యస్ డిసి కె.భాస్కర్, జెడ్పీ సిఈవో యం.శ్రీహరి, డిఆర్డీఏ పిడి ఆర్.విజయరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడి యం.ముక్కంటి, సర్వే సహాయ సంచాలకులు అన్సారీ, నగరపాలక కార్పొరేషన్ కమీషనరు ఏ.భాను ప్రతాప్ లు అర్జీలు స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని,క్షేత్రస్థాయిలో ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. శాఖలు వారీగా వచ్చిన అర్జీలను పరిశీలించి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. అర్జీలు పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. పిజిఆర్ యస్ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించి క్షేత్రస్థాయిలో ఉత్పన్నమయ్యే సమస్యలను క్షేత్రస్థాయిలోనే చక్కని పరిష్కార మార్గాలు చూపించి అర్జీలు రీ-ఓపెన్‌కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు.

**వచ్చిన అర్జీలలో కొన్ని..**ఏలూరు మండపం పత్తేబాదు వృద్ధాశ్రమం నివాసి గంధం అంజయ్య నేను అనాథను వృద్ధాశ్రమంలో కాలం గడుపు తున్నాను. నా కాలుకు దెబ్బ తగిలింది ప్రభుత్వాసుపత్రిలో ఆపరేషన్ చేయించుకునుటకు నాకు సహాయ,సహకారాలు అందించాలని కోరారు, మండవల్లి మండలం అల్లినగరం చెందిన జుజ్జవరపు పాల్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికునిగా పనిచేస్తున్నాను. కొన్ని నెలలుగా జీతం రావడం లేదని పరిష్కారం చూపాలని అర్జీని ఇచ్చారు, చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లి చెందిన కొల్లి నర్సారెడ్డి మా 9వ వార్డులో డ్రైన్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని నిర్మాణం చేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవించు కున్నారు, కైకలూరు మండలం ఆటపాక చెందిన తోట శ్రీనివాస నాయుడు మా రహదారికి అడ్డంగా కరెంటు స్తంభాలు ఉన్నాయని తొలగించాలని విద్యుత్తు శాఖ అధికారులను కోరగా డబ్బులు చెల్లించాలని అన్నారని, మేము నిరుపేదలము మీరే మాకు న్యాయం చేయాలని వేడుకున్నారు, కలిదిండి మండలం మూలలంకకు చెందిన యస్.యన్.వి. సత్యనారాయణ మాగ్రామం లో విద్యుత్తు వైర్లు క్రిందకి వేలాడుతున్నాయని పూర్వం వేసిన విద్యుత్తు స్తంభాలు కురసగా అయ్యాయని ఈ సమస్యకు పరిష్కారం చూపాలని అర్జీని ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు,జిల్లా కలెక్టరేటు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ రిసర్వే తప్పులు సవరించండి

**- రాజకీయ విశ్లేషకులు, టిడిపి నాయకులు దాయం ప్రభాకర్**



**ఇరగవరం,మేజర్‌న్యూస్ :**ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వమిత్వ యోజన పథకంలో పలు పొరపాట్లు ఉన్నాయని కత్తవపాడు మాజీ ఎంపీటీసీ సభ్యులు, టీడీపీ నాయకులు,ప్రముఖ రాజకీయ విశ్లేషకులు దాయం ప్రభాకరరావు (చిన్నారావు)విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ సర్వే, సరిహద్దుల చట్టం ప్రకారం ఆస్తి హక్కు కల్పించడం అభినందనీయమన్నారు. కానీ దీనిలో సాంకేతిక లోపమా లేక అమలులో లోపమో మండలంలోని కత్తవపాడులో రి.స.నంబర్ 10లో 3నుండి 8వరకు,సర్వే నంబర్ 52లో 3నుండి 8వరకు సర్వే నంబర్ 53లో 1,4నుంచి 26ను నిషేధిత జాబితాలో పెట్టారన్నారు. ఈ జాబితా కలెక్టర్ ఇప్పటి నిషేధించి ఉందన్నారు వీటితో పాటు రి.స.నంబర్ 52-2,ఒక ఎకరా నాలుగుసెంట్ల భూమి కుంట,పుంతలుగా ఏర్పాటుచేసారు. కానీ దానిలో 9మందికి ఇంటి పట్టాలు ఇచ్చారన్నారు. ఈ భూమికూడా నిషేధిత జాబితాలో ఉందన్నారు. సర్వేనంబర్ 53-3ను జి.డి గ్రామకంఠంగా మార్చుచేసి. ఇదికూడా నిషేధిత జాబితాలో చేర్చారన్నారు. దీనివలన లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై అధికారులు స్పందించి ఫ్రీ హోల్డ్ భూమిగా మార్పు చేయాలని అయన కోరారు.

# మట్టి వినాయకులను పూజిద్దాం -పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**భీమవరం, మేజర్ న్యూస్:**సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు వినాయకుని మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. నరసాపురం పట్టణానికి చెందిన విశ్వేశ్వర సేవా సదన్ డా.కంచర్ల కాశీ విశ్వేశ్వరరావు, శిరిపుష్ప దంపతులు తయారుచేసిన వినాయకుని మట్టి విగ్రహాలను కలెక్టరేట్‌కు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వలన జలవనరులు కలుషితమై ఎన్నో జీవరాసుల మనుగడ ప్రశ్నార్థముగా మారిందన్నారు. జిల్లా ప్రజలందరూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు భక్తిశ్రద్ధలతో మట్టితో తయారు చేసిన వినాయకుని విగ్రహాలను మాత్రమే పూజించాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడే సంకల్పంతో విశ్వేశ్వర సేవా సదన్‌తమ వంతు కృషిగా ఎన్నో సంవత్సరాలుగా అనేక వేల మట్టి విగ్రహాలను తయారు చేసి ప్రజలకు అందించడం అభినందనీయమని, కంచర్ల కాశీ విశ్వేశ్వరరావు శిరీష దంపతులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర సేవా సదన్ కాశీ విశ్వేశ్వరరావు, శిరీష దంపతులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి దృశ్యాలువాతో సన్మానించి అభినందించారు.

విశ్వేశ్వర సేవా సదన్ నిర్వాహకులు డాక్టర్ కంచర్ల కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణానికి కొంతైనా మేలు చేద్దామనే ఆలోచనతో



సుమారు 16 సంవత్సరముల నుండి మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి ప్రజలకు అందిస్తున్నమని అన్నారు. 55 నదీ జలాల నుండి తీసుకువచ్చిన జలములతో, సుగంధ ద్రవ్యాలతో మట్టిని కలిపి మట్టి వినాయక విగ్రహాలను తయారు చేయటం జరుగుచున్నదన్నారు. విజయవాడ, రాజమండ్రి ప్రాంతాల నుండి కాకుండా ఇతర దేశములకు కూడా మేము తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలను తీసుకు వెళు తుంటారని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి ఆయన వివరించారు. ఈ విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, డిటి ఎం.సన్యాసిరావు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మనస్థాపంతో చనిపోతానని యువకుడు హల్ చల్

**- చాకచక్యంగా దూరదర్శన్ టవర్ నుండి యువకుడుని దింపిన ఎస్ ఐ**





**కొయ్యలగూడెం రూరల్, మేజర్ న్యూస్ :**కుటుంబ కలహాలు నేపథ్యంలో తల్లిదండ్రులు మందలించారనే కారణంతో మానసికంగా బలహీనపడి ఒత్తిడికి లోనై యువత నూరేళ్ల జీవితాన్ని చేతులారా ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారని ప్రజలు అంటున్నారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం గ్రామానికి చెందిన తిరణాతి అయ్యప్ప తండ్రి. సుబ్రమణ్యం స్థానికంగా అశోక్ నగర్ లో ఉంటూ బడ్డీ కొట్టు పెట్టుకుని కుటుంబ జీవనాన్ని సాగిస్తుంటాడు . బస్టాండ్ వద్ద కొవ్వూరు రోడ్డు వైపు ఉన్నటువంటి దూరదర్శన్ కేంద్రం వద్ద ఉన్న టవర్ పైకి సోమవారం ఎక్కి చనిపోతానని హల్చల్ సృష్టించాడు. విషయం ఎస్సై.చంద్రశేఖర్‌కు చేరడంతో తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అయ్యప్ప ఇటీవల బెట్టింగ్ యాప్ లో నగదు పోగొట్టుకోవడంతో తల్లిదండ్రులు మందలించారని ఆవేశంలో చనిపోవాలనే ఉద్దేశంలో మద్యం సేవించి టవర్ పైకి ఎక్కాడని అన్నారు. తల్లిదండ్రులు ఎంత వారించినా అయ్యప్ప దిగిరాకపో వడంతో సంఘటన స్థలంలో ఉద్రిక్త వాతావరణం కొనసాగింది, అనంతరం పరిస్థితి శృతి మించడంతో అగ్నిమాపక సిబ్బంది రక్షణ వలయాన్ని సిద్ధం చేశారు. ఎస్సై చంద్రశేఖర్ సమయస్ఫూర్తిని ఉపయోగించి చరవాణిలో అయ్యప్పతో మాట్లాడడంతో కిందకు దిగి రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయ్యప్పకు మానసిక ధైర్యాన్ని నింపి తల్లిదండ్రులతో ఇంటికి పంపారు. ఈ ఘటనలో పోలవరం డి.ఎస్.పి వెంకటేశ్వరరావు, మేఘలాదేవి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## పిజిఆర్ యస్‌లో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి ఎమ్మెల్యే చింతమనేని అర్జీ



**ఏలూరు,మేజర్‌న్యూస్:** జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మం దిరంలో సోమవారం పిజిఆర్ యస్ కార్యక్రమంలోజిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వికి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆర్జీని ఇచ్చారు. దెందులూరు నియోజకవర్గంలో యూరియా కొరత ఉందని, ప్రతి సొసైటీకి అవసరమైన యూరియా స్టాకును పంపించి, రైతులకు అవసరానికి తగ్గట్టుగా సరఫరా చేయాలన్నారు. రైతులకు ఎరువుల అందించడంలో కోపరేటివ్ సొసైటీలో ఆధారు కార్డు చూపించమని ఓటిపి కారణాలతో జాప్యం జరుగు తుందని, సమస్యని పరిష్కరి ంచా లని కోరారు. నియోజకవర్గంలో సదరం స్పెషల్ క్యాంపులను ఏర్పా టు చేసి మిగిలి ఉన్న దివ్యాంగులకు సర్టిఫికెట్ల జారీని వేగవ ంతం చేసి, పెన్షన్లు మంజూరుకు అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు.

## శారీరక విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల సైకిళ్ళు పంపిణీ



**ఏలూరు, మేజర్ న్యూస్ :** జిల్లాలో అర్హులైన ప్రతీ విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు అందిస్తామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలు వద్ద సోమవారం బొర్రా సుదాకరమ్మ, షేక్ ఇస్మాయిల్ యిద్దరు విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల సైకిళ్లను, ఇద్దరు వయోవృద్ధులు చేతి కర్రలను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హత కలిగిన ప్రతీ విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు అందించడం జరుగుతుందని, అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి. రామ్ కుమార్, ప్రభృతులు పాల్గొన్నారు.

# ట్రంప్ టారిఫ్‌లతో ఆక్వా రైతులకు నష్టం లేకుండా కేంద్రం చర్యలు





**– కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ**
**– త్వరలో ఆక్వా రైతులకు కరెంటు యూనిట్ రూ.1.50కి తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం : ఎంపీ మస్తాన్ రావు**

**భీమవరం, మేజర్ న్యూస్ :** భీమవరం పర్యటనలో ఉన్న ప్రముఖ ఆక్వా ఎక్స్ పోర్టర్, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు సోమవారం కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, మస్తాన్ రావును శాలువాతో సత్కరించి, సాదరంగా ఆహ్వానించారు. కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, ఎంపీ బీద మస్తాన్ రావు తోపాటు పలువురు ఆక్వా రైతు సంఘాల నాయకులు, రైతులు సమావేశమైరైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ ఇటీవల అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌ల వల్ల మన రైతులకు ఎటువంటి నష్టం ఉండకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టిందని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆయన హామీ ఇచ్చారు. కేవలం నాలుగు రోజులు ఎగుమతులు నిలిచిపోవడంతో అమెరికా దిగుమతిదారులు ఆందోళన చెందారని, రైతులు నష్టపోకుండా ఉండేందుకు పెంచిన టారిఫ్‌ను వారే భరిస్తామని తెలిపారని మంత్రి శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. గత కొద్ది రోజులుగా ఈ సమస్యపై ఢిల్లీలో ప్రభుత్వ పెద్దలతో చర్చలు జరిపినట్లు ఆయన వెల్లడించారు. ?రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు మాట్లాడుతూ అమెరికా దిగుమతి కంపెనీలతో చర్చలు జరిపి రైతులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రైతులు అధైర్యపడకుండా ఆక్వా సాగు కొనసాగించాలని ఆయన భరోసా ఇచ్చారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రైతులకు కరెంటు యూనిట్‌ను రూ. 1.50కి తగ్గించేందుకు సిద్ధంగా ఉందని, మంత్రి లోకేష్ తోపాటు ఇతర మంతులతో జరిగిన సమావేశంలో దీనిపై తమకు స్పష్టమైన హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు ఆక్వారైతుల సమస్యల పరిష్కారం కోసం కేంద్రమంత్రి శ్రీనివాస వర్మతో కలిసి ఢిల్లీలో పలువురు మంత్రులను కలిసినట్లు పేర్కొన్నారు. రైతులు నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఇద్దరు నాయకులు స్పష్టం చేశారు. ?ఈ సమావేశంలో జిల్లా రొయ్య రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల సుబ్బరాజు,పి. వెంకటేశ్వర రాజు, సిహెచ్. రామభద్రరాజు, ఐటి సుబ్బరాజు, తులసీ రాంబాబు, బిజెపి నర్సాపురం పార్లమెంట్ కన్వీనర్ శ్రీ పేరిచర్ల సుభాష్ రాజు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ కలిదిండి వినోద్ వర్మ, వీరవల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిషేధంపై అవగాహన సదస్సు





భీమవరం, మేజర్‌న్యూస్:ఆడపిల్లకు 18 సం.లు మగపిల్లవాడికి 21 సం.లు నిండకుండా పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహం చేసుకున్నవారు, చేయించినవారు, హాజరైన వారందరూ నేరస్థులుగా పరిగణించబడతారని, నేరం రుజువైతే రెండేళ్ల వరకూ జైలుశిక్ష, లక్ష రూపాయల వరకూ జరిమానా విధించబడుతుందని" భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.సుధారాణి అన్నారు.రాష్ట్ర న్యాయ సేవాధి కార సంస్థ ఆదేశాల మేరకు బాల్య వివాహాల నిషేధంపై అవగాహన కల్పించుటకు ఈనెల 24 నుండి 30 వరకూ నిర్వహిస్తున్న అవగాహనా కార్యక్రమాల్లో భాగంగా భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం డిఎన్ఆర్ జూనియర్ కాలేజీ లో న్యాయమూర్తి ఎం.సుధారాణి అధ్యక్షతన అవగాహనా సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వై. యోహాన్ (న్యూటన్), ప్యానల్ న్యాయవాదులు.సుధీర్, పి.అంబేద్కర్, .జ్యోతి, మీడియేషన్ న్యాయవాది కె.విజయలక్ష్మి, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ నోడల్ ఆఫీసర్ పి.విజయలక్ష్మి, జిల్లా గిరిజన శాఖ అధికారి డి.పుష్పరాణి, టూటౌన్ ఎస్సై మహమ్మద్.

రహమాన్, బలుసు మూడి పీహెచ్సీ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు కె.చంద్రరావు, కె.కాళేశ్వరి పాల్గొ న్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శివాజీరాజు వందన సమర్పణతో కార్యక్ర మం ముగిసింది. బార్ అసోసియేషన్ అధ్యక్షులు వై. యోహాన్ అడిగిన జనరల్ నాలెడ్జి ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన పిల్లలకు న్యాయమూర్తి చేతుల మీదుగా పుస్తకం, పెన్ను బహుకరించారు.

# తూకాల్లో తేడాలు వస్తే చర్యలు

**తొలిసారిగా ఆన్ లైన్‌లో వెరిఫికేషన్ సర్టిఫికెట్**
**లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ ప్రసాద్**

**బుట్టాయిగూడెం: మేజర్ న్యూస్:** కార్డుదారునికి సక్రమమైన తూకంతో వస్తువులు అందించాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ( తూనికలు కొలతలు) శాఖ ఏలూరు ఇన్ స్పెక్టర్ జీవి ప్రసాద్ హెచ్చరించారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద రేషన్ దుకాణదారుల వేయింగ్ మిషన్లకు సోమవారం సాయంత్రం సీలు వేశారు. ప్రతి మిషన్ ని ముందుగా పరిశీలించి 10 కేజీల రాయి పెట్టి సీలు వేయించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ వేయింగ్ మిషన్లు ను ప్రతి సంవత్సరానికి ఒకసారి సరిచూయించుకొని సంబంధిత శాఖ అధికారులతో ముద్ర వేయించుకోవాలని తెలిపారు. ముద్ర వేయించుకున్న ప్రతి ఒక్కరికి వెరిఫికేషన్ సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ వెరిఫికేషన్ సర్టిఫికెట్‌ని ఈ ఏడాది ఆగస్టు నెల నుండి తొలిసారిగా ఆన్ లైన్ ద్వారా అందించడం జరుగుతుందన్నారు. రేషన్ దుకాణాల వద్ద వినియోగదారులు కాటాలను సరి చూడమన్నప్పుడు అక్కడ ఉన్న ఐదు కేజీల రాయి పెట్టి తప్పనిసరిగా చూపించాలని



తెలియజేశారు. సంవత్సరంలో 12 నెలలను గాను మూడు నెలలకు ఒక క్వాటర్ చొప్పున ఏ బి సి డి నాలుగు క్వార్టర్లుగా ఉన్నాయని చెప్పారు. ముందస్తుగా తేదీలు నిర్ణయించి ఆయా క్వాటర్లో ఉన్న అన్ని గ్రామాల్లోని వేయింగ్ మిషన్లను తనిఖీ చేసి సీలు వేయడం జరుగుతుందని అన్నారు. వ్యాపారస్తులు ప్యాకెట్ మీద ఉన్న ఎమ్మార్పీ ధరల కంటే అధిక ధరకు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. ప్రతి ప్యాకెట్ మీద వస్తువు పేరు ధర అడ్రస్సు గడువు తేదీ తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. అటువంటివి ఏమీ లేకుండా అమ్మినట్లు తమ దృష్టికి వస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయనతోపాటు సివిల్ సప్లై ఆర్ ఐ కుంజా పద్మ, పండు తదితరులు ఉన్నారు.

# ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీ

**జిల్లా వ్యవసాయ అధికారి షేక్.హబీబ్ భాషా**



**కొయ్యలగూడెం, రూరల్ మేజర్ న్యూస్ :** డీలర్లు యూరియా, ఎరువులను ఈ సీజన్లో వాడే రైతులకు ఉపయోగపడే విధంగా అమ్మకాలు జరపాలని కనిష్ట దొరకంటే. అధిక ధర తీసుకునే వారిపై చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ .హబీబ్ భాషా అన్నారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం మండలం పరిసర ప్రాంతాలలో ఉన్నటువంటి గోడౌన్స్,ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో కోట రామచంద్రపురం వ్యవసాయ సంచాలకులు పి.బుజ్జిబాబు ఏవో కెఎస్ఎన్ .పోసారావు పాల్గొన్నారు అనంతరం డీలర్లతో ముఖాముఖి మాట్లాడుతూ యూరియా డిఏపి వంటి నిల్వలను తనిఖీ చేసి, కృత్రిమ కొరత అనేది లేకుండా చూడాలని తెలిపారు. రైతులు అడిగిన ఎరువులు తప్ప మరి ఏ ఇతర రసాయనాలు ఇవ్వద్దని డీలర్లకు తెలియజేశారు. కొంతమంది రైతులు రబీ రెండో పంటగా వేసే మొక్కజొన్న ఉద్యన పంటలకు ముందుగానే యూరియా తీసుకు వెళ్తున్నారు అందువల్ల యూరియా కొరత కొన్ని గ్రామాలలో ఏర్పడి ందని డీలర్లు గ్రహించి సరైన రైతులకు యూరియాను అంద జేయాలని తెలిపారు.కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

# చిన్న వెంకన్నకు యజ్ఞోపవేతము కానుక





**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** శ్రీవారికి భక్తులు 106 గ్రాములు యజ్ఞోపవేతాము కానుకగా సమర్పించారు.భీమవరం వాస్తవ్యులు పెన్నమరాజు శ్రీనివాసరాజు, విజయ వర్మ, భూపతి రాజు, సోమవారం ఉదయం ఆలయానికి విచ్చేసి స్వామివారి దర్శనం అనంతరం ఆలయ ఆఫీసులో దేవాలయ ఈవో ఎన్ వి సత్యనారాయణమూర్తికి ఎరుపు రాళ్లు 20 ఆకుపచ్చ రాళ్లు నాలుగు తెలుపు రాయ ఒకటి పొందుపరిచిన లాకెట్టుతో 106 గ్రాముల యజ్ఞాపవేతము కానుకగా అందించారు. దాతలకు బాండ్ పత్రాలను స్వామివారి ప్రసాదాలను అందించి ఈవో ప్రత్యేకతలు తెలియజేశారు.

## చిన్న వెంకన్న హుండీ ద్వారా

## రూ. 3కోట్ల 61లక్షల 54వేల 678 ఆదాయం



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** చిన్న వెంకన్న హుండీ లెక్కింపు సోమవారం ఉదయం ప్రమోద కళ్యాణ మండప ఆవరణలో దేవాలయ కార్యనిర్వాహణాధికారి ఎన్వీ సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు నడుమ దేవాలయ సిబ్బంది హుండీల లెక్కింపు నిర్వహించారు. గడచిన 38 రోజులకు గాను జరిగిన ఈ హుండీ లెక్కింపు లో శ్రీ వారికి నగదు రూపేణ రూ 3కోటి 61లక్షల 54వేల 678లు ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో సత్యనారాయణ మూర్తి తెలిపారు.అలాగే భక్తులు సమర్పించిన కానుకల రూపేనా 261 గ్రాముల బంగారం,6-834 కేజీల వెండి లభించినట్లు ఈ ఓ పేర్కొన్నారు. పాత నోట్లు 500(24), 2000(27),1000(1) అలాగే 13 విదేశీ కరెన్సీ సైతం హుండీలో ద్వారా లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.ఈ క్రమంలో అన్ని విభాగాల సూపరింటెండెంట్లు,ఆలయ సిబ్బంది, భక్తులు, సేవకులు, పాల్గొన్నారు.